క్లుప్తంగా

పక్కాగా మస్టర్ నమోదు చేయాలి

- డ్వామా పీడీ సలీం బాషా



కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న పీడీ సలీంబాషా

కూడేరు: ఉపాధి కూలీల మస్టర్‌ను పక్కాగా నమోదు చేయాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ సలీం బాషా హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని కడదరకుంట, చోళసముద్రం, జల్లిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో చేస్తున్న పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు, చేపడుతున్న ఫారంపాండ్ల తవ్వకాలను పరిశీలించారు. మండలానికి కేటాయించిన పశువుల నీటి తొట్టెలు నిర్మాణాలు, ఫారంపాండ్ల తవ్వకాలను గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీడీ విజయకుమార్, ఏపీఓ పోలేరయ్య, ఇంజనీర్ రాజేష్, టీఏలు కోమల, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు పావని

ఉరవకొండ రూరల్: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని, శరీరంలో రక్త శాతం తగ్గకుండా జాగ్రత పడాలని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యురాలు పావని తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్ లు శేఖర్, స్వర్ణలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మీ సహకారాన్ని ఎన్నటికీ మరువలేను



ఏఓకు జ్ఞాపికను అందిస్తున్న ఎంపీఈఓలు

కణేకల్లు: మీ సహకారాన్ని ఎన్నటికీ మరువలేనని వ్యవసాయశాఖ అధికారి ఎ.శ్రవణ్‌కుమార్ తెలిపారు. కళ్యాణదుర్గానికి బదిలీ అయిన ఏఓను సిబ్బంది, ఫర్టిలైజర్‌షాపు యజమానులు మంగళవారం సన్మానించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతోనే తాను ఐదేళ్లపాటు సమర్థంగా పనిచేయగలిగానన్నారు. సిబ్బంది సహకరించకపోతే పని చేయడం కష్టమన్నారు. అనంతరం సిబ్బంది,ఫర్టిలైజర్‌షాపు యజమానులు ఏఓకు శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు.

స్థల ఆక్రమణదారులకు నోటీసులు



ప్రభుత్వ స్థల ఆక్రమణదారులకు నోటీసులు అందిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉరవకొండ: పట్టణంలోని సర్వే నంబర్ 538, ఎల్‌పీ నం.77–96 హైదరాబాద్ లేఅవుట్‌లోని 36 సెంట్ల పంచాయతీ ప్రజావసరాల స్థలాన్ని ఆక్రమించిన వారికి పంచాయతీ కార్యాదర్శి గౌస్‌సాహెబ్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా ఈఓ మాట్లాడుతూ 538 సర్వే నంబర్‌లో 3.57 ఎకరాల భూమి హైదరాబాద్ లేఅవుట్ కాగా, అందులో 36 సెంట్లు ప్రజాప్రయోజనాల కోసం ఉరవకొండ మేజర్ పంచాయతీకి కేటాయించి, రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లు తెలిపారు. ఈస్థలంలో బోర్డు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈభూమిలో పంచాయతీ బోర్డును తొలగించి, భూమిని ట్రాక్టర్‌తో చదును చేయించారన్నారు. సదురు ఆక్రమణదారులకు నోటీసులు అందించామని, వారం రోజుల్లో వారు ఆభూమిపై హక్కులుంటే డాక్యుమెంట్లను చూపాలని తెలిపారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హర్షలత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ల్యాబ్ సౌకర్యం ఉందని, ఫిజికల్ ఎడ్యుకేషన్, లైబ్రరీ, ఎన్ఎస్ఎస్, ఇండోర్ స్టేడియంలలో అత్యుత్తమ సదుపాయాలతో పాటు, జేకేసీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ద్వారా అన్ని పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు.

సంకల్ప పాదమై.. కదిలింది ప్రజా చైతన్యయాత్ర

ఆర్డీటీ పరిరక్షణకు అడుగులో అడుగేస్తూ...

- పల్లె పల్లెలోనూ కదిలి వచ్చిన జనం
- ఇతర ప్రాంతాల నుంచీ ప్రజల భారీ స్పందన
- ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేసే వరకూ పోరాటం
- మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త రంగయ్య



కరిగానిపల్లిలో పాదయాత్ర చేస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ నేత ఉమా, మండల ఎంపీపీ కమలా నాగరాజు, పార్టీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు తదితరులు

కుందుర్పి: ఆర్డీటీ పరిరక్షణకు ప్రజా చైతన్యం సంకల్ప పాదమై..అడుగులో అడుగు వేస్తూ యాత్రలా కదిలింది. వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపు అందుకున్న పేదలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు అన్ని వర్గాల వారూ ఊరూరా ఉత్సాహంగా పాల్గొనగా.. కుందుర్పి మండలం మందలపల్లి నుంచి పాదయాత్ర మంగళవారం ప్రారంభమైంది. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ఆర్డీటీ లబ్ధిదారులు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. స్థానిక మండల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు మద్దతు ప్రకటించారు. స్థానికులతో పాటు కళ్యాణదుర్గం, రాయదుర్గం, అనంతపురం ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాదయాత్రలో పాదం కలిపారు. పాదయాత్ర చేపట్టిన అన్ని గ్రామాల్లో ప్రజలు మాజీ ఎంపీ రంగయ్య బృందానికి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. డప్పులు వాయిస్తూ పాదయాత్రలో భాగస్వాములయ్యారు.

ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేసే వరకూ పోరాటం..

కరిగానిపల్లి, తెనగల్లు, ఎనుములదొడ్డి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడుతో కలిసి రంగయ్య మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేసేంత వరకూ తన పోరాటం ఆపబోనని ఆయన స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మున్సిపల్ విభాగం కన్వీనర్ ఐ.సుధీర్, వివిధ మండలాల కన్వీనర్లు గోళ్ల సూరి, జీహెచ్ రాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీలు అంజి, కమలా నాగరాజు, పార్టీ ఉపాధ్యక్షులు మఠం భీమప్ప, బొమ్మలింగ, కిరీటియాదవ్, జేఏసీ కన్వీనర్ ఈ రాము, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు తిప్పేస్వామి, ఐటీ విభాగం తాలూకా అధ్యక్షుడు మర్రిస్వామి, మాజీ వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, తాలూకా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శులు రాజు, మంజునాథ్, మాజీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, సర్పంచులు వన్నూర్ రెడ్డి, రామ్మూర్తి, అతావుల్లా, గంగాధర, వెంకటేశ్, విజయ్, జగన్, ఎంపీటీసీలు డాక్టర్ ఈరన్న, పెద్దప్పయ్య, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, నాయకులు గార్మెంట్స్ గోపాల్, నిజవల్లి బాబు, రామిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ముజీ వుల్లా, లెనిన్ బాబు, బీటీ రాము, సురేష్, చేనేత విభాగం శ్రీనివాసులు, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ లింగప్ప, మాజీ సర్పంచు తిప్పేస్వామి, లాయర్ లక్ష్మీ కాంత్, ఎనుములదొడ్డి తిప్పేస్వామి, బాద పల్లప్ప, శివప్ప, ఖాసీం, అజయ్ బాబు, మంగల మూర్తి, ఆనంద్, వడ్డే గంగన్న, గొల్ల నాగభూషణ, మిద్దె శంకర్, పశువుల రాజన్న, బోయ శ్యామన్న, కిశోర్, లోకేష్, రాజు, తిప్పారెడ్డి, రామాంజనేయులు, దేవరాజు, జి.మల్లయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రాయదుర్గం, అనంతపురం నేతల మద్దతు..

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కోసం పాదయాత్ర చేస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య పాదయాత్రకు రాయదుర్గం నియోజకవర్గం నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, సీనియర్ నాయకులు కోకుర్తి జయరామిరెడ్డి, ఎంపీపీ ఎం.శివారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్‌కే బద్రీనాథ్, ఎంపీటీసీలు వెంకటేశులు, మారెన్న, కోకుర్తి సర్పంచు భాస్కర్ రెడ్డి, నాయకులు ఎంపీ సిద్ధప్ప, కె.మాధవరెడ్డి, జిలాన్ బాషా, గోవిందరాజులు, ఆనందరెడ్డి, బషీర్, గోల్డ్ ఇస్మాయిల్, రామాంజనేయులు, కృష్ణమూర్తి, రాము, రఘు, మంజు, గోవిందు, వెంకటరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, లాలుస్వామి, రాజేష్‌రెడ్డి, ఇమాంవలి, రహీమ్, రవి ప్రకాష్ రెడ్డి, రవితో పాటు పలువురు పాదయాత్రలో పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణ, ఏపీ వెనుకబడిన ప్రాంతాల ఉపాధి కల్పన అధ్యక్షులు ఆకుతోట పల్లి నారాయణరెడ్డి, తలారి సత్తి, దొడగట్ట నారాయణ, మల్లికార్జున, పరంధామరెడ్డి, మల్లికార్జున, నారాయణస్వామి, కిరీటి యాదవ్ లు పాదయాత్రకు మద్దతు తెలిపారు. కుందుర్పి మండలంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు వ్యవసాయ సంఘం తాలూకా కార్యదర్శి గోపాల్, మండల సహాయ కార్యదర్శి శివలింగప్పలు తమ మద్దతు తెలిపారు. కంబదూరు జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, శెట్టూరు మండల కన్వీనర్ ఎంఎస్ రాయుడు, జిల్లా కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు పాల్గొన్నారు.



పాదయాత్రలో నృత్యం చేస్తూ ప్రజలకు ఉత్సాహం నింపుతున్న పార్టీ నేతలు



తెనగల్లులో రంగయ్యను సన్మానిస్తున్న రాయదుర్గం వైఎస్సార్‌సీపీ నేతలు, చిత్రంలో ఉమా, వెన్నపూస



మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, చిత్రంలో మద్దతు తెలుపుతున్న సీపీఐ నాయకులు



ఎనుములదొడ్డిలో ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్న ప్రజలు

'దుర్గం' నేతల సంఘీభావం



పాదయాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం: ఆర్డీటీకి ఎఫ్ఆర్ఏ రెన్యూవల్ కోసం కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా రాయదుర్గం నుంచి వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కోకూర్తి జయరామిరెడ్డి, మాధవరెడ్డి, పైతోట సంజీవ, హనుమంతరాయుడు మంగళవారం పాల్గొని మద్దతు తెలిపారు. ఉపేంద్రారెడ్డి వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



కొర్రకోడులో కొవ్వొత్తులతో ర్యాలీ

కూడేరు: పేదలకు వరంగా నిలిచిన ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాత్రి కొర్రకోడులో ప్రజలు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ ప్రభుత్వాలు కూడా చేయని విధంగా ఆర్డీటీ పేదలకు ఎంతో సేవ చేసిందన్నారు.

అధికారులకు సన్మానం



కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

విడపనకల్లు: కరకముక్కల, విడపనకల్లు పంచాయతీలో గ్రేడ్–3 నుంచి గ్రేడు–2 పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యర్శులను మండల పరిషత్ అధికారులు మంగళవారం సన్మానించారు. మండలంలో పనిచేస్తున్న గ్రేడు–3 పంచాయతీ కార్యదర్శులు రమ్య, మహబూబ్ బాషాలకు పదోన్నతి లభించింది. రమ్య కర్నూలు జిల్లాలోని చిప్పగిరికి, మహబూబ్ బాషా గుత్తికి బదిలీ అయినట్లు ఎంపీడీఓ షకీలా బేగం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులకు శాలువా కప్పి సత్కరించారు. ఏఓ భాస్కర్, ఈఓఆర్డీ సత్యబాబు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాలికా విద్య ప్రాధాన్యతను గుర్తించాలి



కిశోరి వికాసం పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం



ఉరవకొండలో మానవహారం ఏర్పాటు చేసిన దృశ్యం

ఉరవకొండ: బాలికా విద్య ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఉరవకొండ ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోరి వికాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, కిశోరి బాలికలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్లు ఉమారాణి, విజయకుమారి, రాజమ్మ, రాబి యా, తిరుపాల్‌బాయి అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు

వజ్రకరూరు: బాల్య వివాహాలతో అనర్థాలే అధికమని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి అ న్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో కిశోరి వికాసం వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీడీపీఓ శ్రీదేవి, సర్పంచు మోనాలిసా తదితరులు హాజరయ్యారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పద్మావతి, హెచ్.పద్మా, ఏపీఎం లలిత, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఏఎన్‌ఎం సుకన్య, మహిళా పోలీస్‌లు పార్వతి, నాగేశ్వరి, అంగన్ వాడీ, ఆశా కార్యకర్తలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: గ్రామీణ ప్రాంతాలల్లో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని సీడీపీఓ లక్ష్మీప్రసన్న కోరారు. మంగళవారం గరుడాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు.అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

నీటి వాటాకు చర్యలు తీసుకోవాలి

రాయదుర్గంటౌన్: తుంగభద్ర డ్యాం ద్వారా రాయలసీమకు పూర్తి స్థాయి నీటి వాటాకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున కోరారు. తుంగభద్ర డ్యాంపై లక్షా 80 వేల ఎకరాల ఆయకట్టు రైతులు ఆధారపడి ఉన్నట్లు చెప్పారు. డ్యాంలో పూడికతో నీటి వాటాలో తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. పూడిక తీతపై మూడు రా ష్ట్రాలకు బాధ్యత ఉందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మరోవైపు డ్యాం గేట్లు మార్చాలని నిపుణులు చెబుతున్నారని, దీనిపై ఇరు రాష్ట్రాలు చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, అధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు

గుమ్మఘట్ట: మండలంలోని 75వీరాపురం, గుమ్మఘట్ట గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ నెల 13 వరకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రంలో 0–6 ఏళ్ల పిల్లలు, పాఠశాల విద్యార్థులు, చిన్నారుల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు.

చంద్రన్న బీమా..ఏమాయెనో..?

- దరఖాస్తులు కూడా స్వీకరించని వైనం
- వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా 'వైఎస్సార్ బీమా' అమలు
- పట్టించుకోని కూటమి పాలకులు

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి గద్దె నెక్కిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా వాటిని అమలు చేసిన పాపానపోలేదు. కనీసం 'చంద్రన్న బీమా'పథకాన్ని అమలు చేయడంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా కుటుంబ పెద్ద దిక్కును కోల్పోతే పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. ఉరవకొండ నియోజకవర్గంలో ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు, బెళుగుప్ప మండలాలు ఉన్నాయి. గత వైఎస్సార్ హయాంలో 2019 నుంచి 2024 వరకు 612 కుటుంబాలకు పరిహారం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈపథకాన్ని ఒక్కరికీ వర్తింపజేయలేదు.

పేరు మార్పుతోనే సరి:

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 'చంద్రన్న బీమా'గా పేరు మార్చి దాని అమలును మాత్రం గాలికొదిలేశారు. సహజ మరణానికి రూ.5లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు అందిస్తామని సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రజలను మభ్యపెట్టారు. గద్దె నెక్కి ఏడాది పూర్తయినా బాధిత కుటుంబాలకు బీమా సొమ్ము మంజూరు చేయడంలేదు.


ప్రారంభం కాని వెబ్‌సైట్:

2024 తర్వాత కూటమి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం వెబ్‌సైట్‌ను తొలగించింది. ఆ తర్వాత కొత్తగా 'చంద్రన్న బీమా' వెబ్‌సైట్‌ను పెట్టి దాన్ని ఇప్పటి వరకూ ప్రారంభించలేదు. మృతి చెందిన కుటుంబాల నుంచి క్లయిమ్స్ సేకరించేందుకు మార్గదర్శకాలు విడుదల చేయలేదు. కనీసం దరఖాస్తులు స్వీకరించాలా వద్దా ? అన్న ఆదేశాలు కూడా ఇవ్వలేదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. దీంత ఆయా కుటుంబ యజమానులు, సభ్యులను కోల్పోయిన బాధితులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఠంఛన్‌గా:

గత వైఎస్సార్‌సీపీ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపు, 50 నుంచి 60 ఏళ్ల వారు ఎవరైనా మరణిస్తే రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు ఒక్కో కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజురు అయ్యేది. మృతి చెందిన కుటుంబానికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి తక్షణ సాయంగా రూ.10 వేలు ఇచ్చేవారు. మిగితా సొమ్ము 15 రోజుల్లో బాధితుల బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేది. ఈబీమా సొమ్ము కోసం అప్పటి జగనన్న ప్రభుత్వమే బీమా ప్రీమియం కట్టింది. త ద్వారా కులం, మతం, పార్టీలు చూడకుండా ప్రతి పేద కుటుంబానికీ సత్వర సాయం అందేది.

ఇంత నిర్లక్ష్యమా?



బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే బాధిత కుటుంబాలకు మంజూరు చేస్తామన్న చంద్రన్న బీమా పథకం అమలుపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం సరి కాదు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. గత వైఎస్సార్ హయాంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధిత కుటుంబాల ఇంటికెళ్లి బీమా సొమ్ము ఇచ్చారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పేదలకు ఎంతో ధీమా కలిగించే బీమా పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదు.

– వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త,ఉరవకొండ

శ్రీచైతన్య విద్యా సంస్థలను సీజ్ చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లతో విద్యతో వ్యాపారం చేస్తున్న శ్రీచైతన్య విద్యా సంస్థలను వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతురాయుడు కోరారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం నిబంధనలు తుంగలో తొక్కుతున్నట్లు తెలిపారు. శ్రీచైతన్య విద్యా సంస్థలకు అనుమతి లేకపోయినా తల్లిదండ్రులకు టెక్నో, సిబ్యాచ్, ఐపీఎల్ ఎంపీఎల్ సీబీఎస్ఈ అని మాయ మాటలు చెప్తూ, తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తూ అడ్మిషన్లు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీచైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజవర్గ కోశాధికారి పవన్, ఉపాధ్యక్షుడు మురళి, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై కూటమి సర్కారు నిర్లక్ష్యం

కూడేరు: రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని సీపీఐ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రమణ అన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో కూడేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రమణ మాట్లాడుతూ భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం డీటీ సూర్యప్రతాప్‌కు వినతి పత్రం అందించారు. నియోజకవర్గ కార్య వర్గ సభ్యులు వరప్రసాద్, నాయకులు మలరాయుడు, వెంకటేష్, ధనరాజ్, భీమన్న, మల్లమ్మ, కవిత, జ్యోతి, పార్వతి, చిన్న పాల్గొన్నారు.

12న మెగా రక్తదాన శిబిరం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ ఎన్‌జీఓ భవనంలో జేవీవీ ఆధ్వర్యంలో ఈనెల 12న మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు జేవీవీ నాయకులు కెంచే లక్ష్మీనారాయణ, ఎంజీ వీరన్న మంగళవారం తెలి పారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాయదుర్గం శాఖ అధ్యక్షుడు వీరణ్ణ, తాడూరు సిద్దేశ్, కంప్లి హరికృష్ణ ఇంటింటా ప్రచారంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

లారీ క్లీనర్‌గా వెళ్లి యువకుడి అదృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లుకు చెందిన కురుబ బసవరాజు అనే యువకుడు లారీ క్లీనర్‌గా పనిచేసేందుకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బసవరాజు గత నెల 26న అదే గ్రామానికి చెందిన రవి అనే డ్రైవర్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా మహబూబ్‌నగర్ టోల్‌ప్లాజా వద్ద ఓ పెట్రోల్ బంకులో డ్రైవర్ రవి లారీ ఆపి డీజిల్ కొట్టిస్తుండగా, బసవరాజు అదృశ్యమయ్యాడు. బసవరాజు భార్య అనంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కమల్‌బాషా తెలిపాడు.

సంక్షిప్త సమాచారం

ఫిజియోథెరపీపై అవగాహన

రాయదుర్గంటౌన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కొండన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఫిజియోథెరపీ నిజాం ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ నుంచి వైద్యులు రమేష్, సంతోకుమార్ హాజరయ్యారు. మోకాళ్ల, మెడ నొప్పి, తలనొప్పి వంటి వాటికి ఫిజియోథెరపీ కిట్ ద్వారా ఏ విధంగా ఉపశమనం పొందొచ్చని అంశాలను డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.

కౌమార బాలికలకు వ్యాయామం అవసరం

బొమ్మనహాళ్: కౌమార బాలికలకు వ్యాయామం అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతా అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీధరఘట్టలో కౌమార బాలికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోజుకు 30 నిమిషాల శారీరక శ్రమ అవసరమన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సీహెచ్‌ఓ రాజశేఖర్, ఎంపీహెచ్‌ఈఓ శివప్రసాద్, మహిళా పోలీస్ నవ్యమానస పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌కు చెందిన దేవరాజు, దేవమ్మ, ఏడేళ్ల చిన్నారి నాగేంద్ర ద్విచక్ర వాహనంపై బళ్లారి వైపు వెళ్తుండగా నేమకల్లు క్రాస్ వద్ద ఇటీవల ప్రైవేట్ బస్సు ఢీకొనింది. ఈ ప్రమాదంలో నాగేంద్ర అనే చిన్నారికి కాలు విరిగింది. దేవమ్మ తీవ్ర గాయాలతో బెంగళూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. బాధితులు ఫిర్యాదు మేరకు బళ్లారి రూ రల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపా రు. మృతురాలు దేవమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉపాధి పనుల బిల్లులు చెల్లించండి

ఉరవకొండ రూరల్: పెండింగ్ ఉన్న ఉపాధి బిల్లులను చెల్లించాలని ఇంద్రావతికి చెందిన ఉపాధి కూలీ ఓబుళేసు డ్వామా పీడీ సలీంబాషాను కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీడీని కలిసిన ఉపాధి కూలీ.. బిల్లులు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే ఉపాధి కూలీల బిల్లులు మంజూరు చేయాలని అధికారులను పీడీ ఆదేశించారు.

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం

ఆత్మకూరు: పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్ నారాయణస్వామి, సీఐ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పొగాకు వ్యతిరేక పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నారాయణస్వామి పొగాకు ఉత్పత్తులతో కలిగే దుష్ప్రభావాలను తెలియజేశారు.

'సాక్షి'పై టీడీపీ మూకల దాడి అమానుషం



రాయదుర్గం అర్బన్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న సాక్షి విలేకరుల బృందం

రాయదుర్గం: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టు, సాక్షి యూనిట్ కార్యాలయాలపై టీడీపీ మూకల దాడిని ఖండిస్తూ రాయదుర్గం సాక్షి ఆర్‌సీ ఇన్‌చార్జ్ ఇ. రాధాకృష్ణ ఆధ్వర్యంలో సాక్షి టీవీ రిపోర్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, టౌన్ రిపోర్టర్ కే సలాం, గుమ్మఘట్ట రిపోర్టర్ పీ గోవిందరాజులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలనుకోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా అర్బన్ పీఎస్‌లో సీఐ జయా నాయక్, ఎస్ఐ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలోని బొమ్మనహళ్ పీఎస్‌లో రిపోర్టర్ వంశీనాథ్‌రెడ్డి, కణేకల్లు పోలీస్‌స్టేషన్లలో రిపోర్టర్ బాబా సాహెబ్ ఫిర్యాదులు చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి ప్రజాసంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పాత్రికేయ సంఘాలు మద్దతు తెలిపాయి.